టర్ఫ్ పిచ్‌తో తొలి క్రికెట్ స్టేడియం



అధికారులకు సూచనలు చేస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీలో భాగంగా తిరుపతి నగరానికి తొలి టర్ఫ్ పిచ్‌తో కూడిన క్రికెట్ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత స్పష్టం చేశారు. ఇంజినీర్లతో కలిసి ఆమె గురువారం క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. గొల్లవాని గుంట చెరువు అభివృద్ధి వాకింగ్ ట్రాకర్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ ఎండీ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇప్పటివరకు క్రికెట్ ఆడేందుకు టర్ఫ్ పిచ్ అందుబాటులో లేదన్నారు. విషయాన్ని గుర్తించి క్రీడాకారులకు ఓ ఆధునిక క్రికెట్ స్టేడియాన్ని స్మార్ట్ సిటీ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. క్రికెట్ స్టేడియం చుట్టూ, చెరువు వద్ద నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ సౌకర్యవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజనీరు చంద్రశేఖర్, డీఈ విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

28న టీటీడీ స్థానిక ఆలయాల మూత

తిరుపతి కల్చరల్: పాక్షిక చంద్ర గ్రహణంగా కారణంగా ఈనెల 28వ తేదీ శనివారం సాయంత్రం టీటీడీ స్థానిక ఆలయాల తలుపులు మూసివేస్తారు. తిరిగి మరుసటి రోజైన ఆదివారం ఉదయం ఆలయాల తలుపులు తెరుస్తారు. ఈ నెల 29న వేకువ జామున 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్రగ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం, శ్రీకోదండరామ స్వామివారి ఆలయం, శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో 28న రాత్రి 7 గంటలకు ఆలయ తలుపులు మూసివేస్తారు. తిరిగి 29న తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తారు.

శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం

శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 28న అన్నాభిషేకం జరుగనుంది. భక్తులకు అన్నలింగ ఉద్వాసన చేపట్టిన అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తారు. శుద్ధి అనంతరం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సుగంధ ద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహిస్తారు. 28న సాయంత్రం 6.45 గంటలకు ఆలయ తలుపులు మూసి వేసి 29వ తేదీన ఉదయం 4 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు.

బీసీలకు వెన్నెముక సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉమాయాదవ్, కోటూరు ఆంజనేయులు

- సాధికార యాత్రతో సత్తా చాటుదాం

తిరుపతి కల్చరల్: గత ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేశాయని, అత్యంత వెనుకబాటు తనానికి గురవుతున్న బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాలు కల్పించి వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేసి బీసీలకు బ్యాక్ బోన్‌గా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేటర్లు స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేటర్లు ఉమాయాదవ్, ఆవుల రాధ, తిరుత్తణి శైలజ, తాళ్లూరి రత్నకుమారి, కోటూరు ఆంజనేయులు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఇమామ్ మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు గుప్పించి ఓట్లు దండుకొని హామీలు తుంగలో తొక్కి బీసీల నోట్లో మట్టిగొట్టిందన్నారు. పాదయాత్రలో బీసీ వర్గాల్లోని కష్టాలను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే వారికి రాజకీయ అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థిక, సామాజిక చైతన్యానికి బాటలు వేశారన్నారు. గతంలో నున్న ఒక్క బీసీ కార్పొరేషన్‌ను బీసీల్లోని ప్రతి వర్గం లబ్ధి కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వారి అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. తిరుపతిలో సైతం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కార్పొరేషన్‌లో బీసీలకు కార్పొరేటర్లుగా అధిక ప్రాధాన్యం కల్పించడంతో పాటు వివిధ నామినేటెడ్ పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కల్పించి వారికి సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బడుగు, బలహీనవర్గాల చైతన్య కోసం చేపడుతున్న సాధికారిత బస్సు యాత్ర శుక్రవారం తిరుపతి నగరానికి చేరుకుంటుందన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి సాధికారత పాదయాత్ర కొనసాగుతుందన్నారు. సాధికారత పాదయాత్ర గ్రూప్ థియేటర్ వరకు చేరుకొని అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలందరూ భారీ స్థాయిలో తరలివచ్చి తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. టౌన్ బ్యాంక్ డైరెక్టర్ అమరనాథరెడ్డి, ముస్లిం నేత షేక్ ఫరీద్ సాహెబ్, కార్పొరేటర్లు సీకే రేవతి, టి.మునిరామిరెడ్డి, బి.గీత, అనిల్, నరేంద్ర, కుడితి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే ఊరుకోం

తిరుపతి కల్చరల్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ ప్రజాదరణ పొందుతున్న మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని మహాసేన రాజేష్‌ను వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో హెచ్చరించారు. స్థాయి మరచి మహాసేన అని చెప్పుకుంటూ అవాకులు చెవాకులు పేలడం నీతి మాలిన చర్య అని పేర్కొన్నారు. డబ్బులిస్తే ఒక పెయిడ్ ఆర్టిస్ట్‌గా జనసేన, తెలుగుదేశం నేతల పంచన చేరి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పసలేని విమర్శలు చేస్తే సామాజిక వర్గం గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే బడుగు బలహీనవర్గాల సత్తా ఏమిటో చూపిస్తామని తెలిపారు.

దేశభక్తుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- తిరుపతి రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి
- లింగేశ్వరనగర్‌లో నేల తల్లికి నమస్కారం



లింగేశ్వరనగర్‌లో ర్యాలీ చేస్తున్న మాస్, నెహ్రూ యువకేంద్ర సభ్యులు

తిరుపతి రూరల్: దేశభక్తుల త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తిరుపతి రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి పేర్కొన్నారు. మహర్షి అభ్యుదయ సేవా సంస్థ(మాస్) ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం సహకారంతో లింగేశ్వరనగర్ పంచాయతీలో గురువారం నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో దేశభక్తి పెంపొందించేలా గ్రామంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సంపాదించే పోరాటంలో వేలాది మంది దేశభక్తులు ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారి త్యాగాల ఫలితమే నేడు దేశం అన్నిరంగాల్లో సుస్థిర అభివృద్ధిని సాధిస్తున్నట్లు చెప్పారు. ఆజాది కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని మాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి తెలిపారు. దేశభక్తుల త్యాగాలకు చిహ్నంగా ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీలో నిర్మించే స్మారక చిహ్నం కోసం దేశంలో వివిధ ప్రాంతాల నుంచి మట్టిని సేకరించే కార్యక్రమంలో భాగంగా ఈరోజు నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. లింగేశ్వరనగర్, అవిలాల సర్పంచ్‌లు కోటేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



నూతన వరుడి కుటుంబ సభ్యులకు పెళ్లికానుకను అందజేస్తున్న నాయకులు



ఐతేపల్లిలో పెళ్లికానుకను అందిస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను వైఎస్ఆర్ సీపీ నాయకులు వధూవరులకు అందజేశారు. గురువారం స్థానిక భారతీనగర్‌కు సాయినాథ్, భువనేశ్వరి, మండల పరిధిలోని ఐతేపల్లి గ్రామానికి చెందిన సోనియా, ఖాదర్ అలీ బాషాలకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా చంద్రగిరి పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఐతేపల్లి సర్పంచ్ ఫాజిలా నాయకులతో కలసి నూతన వధూవరులకు ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, భాసికం, మహార్షపు పట్టు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు–కుంకుమతోపాటు ముస్లిం వధూవరులకు బంగారు నల్లపూసల దండ, పట్టువస్త్రాలు, స్వీట్లు, వెండి మెట్టెలతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుల్లెట్ దెయ్యాల మాధవరెడ్డి, ముదికుప్పం రామ్మూర్తి, గొబిళ్ల కిషోర్, ఉమర్ సాహెబ్, అంజాద్‌ఖాన్, రహమాన్, సాధిక తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు

నాగలాపురం: మండల పరిధిలో సురుటుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం వైభవంగా ప్రదోష పూజలు జరిగాయి. ముందుగా నందీశ్వర స్వామికి, శ్రీ వాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో పూజలు నిర్వహించారు. ప్రదోష పూజలకు ఉభయదాతలుగా తిరుపతి జిల్లా, ముండ్లపూడి గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్రారెడ్డి ఉభయదారులకు ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాట్లు చేయించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ప్రదోష పూజల అనంతరం స్వామివారి ఉత్సవ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఎస్ఎం సురేష్, ప్రధాన అర్చకులు, సభ్యులు మునివేలు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ధ్వజారోహణం



ఉత్సవాలకు నాంది పలుకుతూ ధ్వజారోహణం

చంద్రగిరి: మండల పరిధిలోని తొండవాడ సమీపంలో గల స్వర్ణముఖనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామివారి ఆలయంలో ముక్కోటి ఉత్సవాలు సందర్భంగా గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం విభూది, చందనం, కుంకుమ, పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. తదుపరి గణపతి హోమం చేపట్టి పూర్ణాహుతితో ముగించారు. అనంతరం భక్తుల చేతుల మీదుగా గోపూజ నిర్వహించారు. కలశ స్థాపన, మండపారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చేతుల మీదుగా ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి మాడవీధుల్లో సింహ వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రఘురామిరెడ్డి, మొగిలి వంశస్థులు, ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి, హేమంత్ స్వామి, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పల్లెపల్లెకు ఆరోగ్య రథాలు

చంద్రగిరి: పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో పల్లెపల్లెకు ఆరోగ్య రథాలను పంపించడం సంతోషదాయకమని దోర్నకంబాల సర్పంచ్ గౌతమి తెలిపారు. గురువారం మండల పరిధిలోని దోర్నకంబాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు క్యాంపు వద్దకు చేరుకుని ఉచిత వైద్యసేవలను వినియోగించుకున్నారు. అనంతరం వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్‌బాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని 523 మంది వినియోగించుకున్నారు. ఉప సర్పంచ్ మురళిరెడ్డి, కార్యదర్శి శిరీష, సోను రెడ్డి, విజయ్ రెడ్డి, శేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ గౌతమి, సెక్రటరీ శిరీష తదితరులు

ప్రజల ఆరోగ్యానికి రక్ష జగనన్న సురక్ష



మెడికల్ కిట్‌ను అందజేస్తున్న అధికారులు

పాకాల: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఉందని ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. గురువారం మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నారని తెలిపారు. సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీ సురేష్, భాస్కర్‌నాయుడు, మునిరత్నంరెడ్డి, నాగూర్‌బాషా, కార్యదర్శి శివయ్యపాల్గొన్నారు.

నేటి నుంచి ఆయుర్వేద సదస్సు

తిరుపతి కల్చరల్: అఖిల భారత ఆయుర్వేద మహాసమ్మేళనం, భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా, టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో శుక్ర, శని, ఆదివారం మూడు రోజులపాటు ఆయుర్వేద పర్వం పేరుతో ఆయుర్వేద సదస్సులు, ప్రదర్శన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆలిండియా ఆయుర్వేదిక్ కాంగ్రెస్ ట్రస్ట్ అధ్యక్షుడు వైద్య దేవేందర్ త్రిగుణ తెలిపారు. ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి, సోవారిగ్పా వంటి వైద్య విధానాల ప్రాశస్త్యాన్ని, ప్రభావాన్ని సామాన్య ప్రజానీకానికి చేరువ చేయాలని తుడా కార్యాలయంలో వెనుకనున్న కచ్చపి ఆడిటోరియంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఆయుర్వేద పర్వం కార్యక్రమంలో ప్రతి రోజు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ఆయుర్వేద వైద్య విధానం, వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్, మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు మనోజ్, ఆయుర్వేదపర్వం చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వీవీ ప్రసాద్, డాక్టర్ ఎ.శంకరబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్య దేవేందర్ త్రిగుణ

వైభవంగా విరూపాక్షమ్మ పుష్పయాగం



ప్రత్యేక అలంకరణలో విరూపాక్షమ్మ అమ్మవారు

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో వెలసిన విరూపాక్షమ్మ అమ్మవారికి గురువారం వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 కిలోల వివిధ రకాల పుష్పాలను ఉభయదాతలు వేణునాథరెడ్డి, తులసిల నివాసం నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారిని ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి అమ్మవారికి సుగంధ భరిత ద్రవ్యాలతో అభిషేకం చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేమంత్రోచ్చారణల నడుమ పుష్పయాగం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అమర్‌నాథ్‌రెడ్డి, మునిక్రిష్టారెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మేధస్సు పెంపుదలకు స్వర్ణప్రషన్



స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లను ఆవిష్కరిస్తున్న డాబర్ ఇండియా ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రపంచంలోనే అతి పెద్ద సైన్స్ ఆధారిత ఆయుర్వేద సంస్థ డాబర్ ఇండియా సంస్థ తయారు చేసిన ఒక విప్లవాత్మక పురోగతి ఉత్పత్తిగా స్వర్ణ ప్రషన్ టాబ్లెట్‌ను గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆ సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాబర్ ఇండియా సంస్థ గ్రూప్ ప్రొడక్ట్ మేనేజర్ సుమన్ ముఖర్జీ మాట్లాడుతూ అందరికీ సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణకై స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లను ఆవిష్కరించామన్నారు. ఈ స్వర్ణ ప్రషన్ మేధస్సును పెంపొందించడంతోపాటు రోగనిరోధక శక్తిని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయ పడుతుందన్నారు. ఈ స్వర్ణ ప్రషన్ టాబ్లెట్లు పుట్టిన పిల్లల నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు ఉన్న పిల్లలందరికీ వినియోగించవచ్చని తెలిపారు. శుక్ర, శని, ఆదివారం మూడు రోజుల పాటు తిరుపతి తుడా కార్యాలయం వెనుకనున్న కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించే 18వ ఆయుర్వేద పర్వంలో తమ డాబర్ సంస్థ భాగస్వామ్యమై ఆయుర్వేద వినియోగం, వాటి ప్రత్యేకతల గురించి సంస్థ అనుభవజ్ఞులు తెలియజేయనున్నారని తెలిపారు. డాబర్ సంస్థ ప్రతినిధులు వెంకటరాజు, దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే భూమనను కలిసిన ఆర్డీవో నిషాంత్‌రెడ్డి



ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవో నిషాంత్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఎ.నిషాంత్‌రెడ్డి గురువారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో భూమన కరుణాకరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛంతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని సత్కరించారు.

పకడ్బందీగా ఈ–క్రాప్ నమోదు

పాకాల: మండలంలోని వల్లివేడు పంచాయతీలో ఈ–క్రాప్ నమోదు పకడ్బందీగా నిర్వహించినట్లు ఉద్యాన సహాయకుడు గోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ 426 మంది రైతుల వద్ద 1062.83 ఎకరాల్లో పంటల సాగు, ఈ–క్రాప్ బుకింగ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఈ–క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించి, గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభలలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో ఉన్న రైతుల క్రాప్ నమోదుతో పాటు అన్ని వివరాలను సమగ్రంగా చదివి వినిపిస్తామన్నారు. రైతు సోదరులు వల్లివేడు రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించిన జాబితాను పరిశీలించి అభ్యంతరాలను తెలిపి సవరణలు ఉంటే గ్రామ ఉద్యాన సహాయకుడిని సంప్రదించాలన్నారు. ఈ–క్రాప్ 2023 సీజన్ సవరణ కోసం ఇది ఆఖరి అవకాశమని, తుది జాబితా ప్రదర్శనలో ఎటువంటి మార్పులు చేయబడవని వివరించారు.

పకడ్బందీగా ఎడ్యుకేషన్ సర్వే

పాకాల: ఎడ్యుకేషన్ సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని, నవంబర్ 3వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ సర్వే జరుగుతుందని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంపికైన పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మట్లాడుతూ 3వ, 6వ, 9వ తరగతి విద్యార్థులకు ఈ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. పాకాల మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 36 పాఠశాలల్లో ఈ మూడు తరగతులకు సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ప్రశ్నలు మొత్తం 60 ఉంటాయని, పరీక్షలు నిర్వహించడానికి ప్రత్యేకంగా ఇన్విజిలేటర్లు వస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 లింగయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గౌస్ ప్యాకీ గర్మీ పండుగ వేడుకలు



దీన్‌దార్లపల్లె గ్రామంలో పండుగ వేడుకలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లె గ్రామంలో గౌస్ ప్యాకీ గర్మీ పండుగ వేడుకలను ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం పెద్దలు, పిల్లలు కలిసి మత పెద్ద గౌస్ ప్యాకీ గర్మీ జ్ఞాపకార్థం చేపట్టే పండుగను ప్రపంచ వ్యాప్తంగా చేపడుతారని ముస్లి పెద్దలు వివరించారు. గౌస్ ప్యాకీ గర్మీ జెండాలను చేతబట్టి గ్రామంలో ప్రదర్శన చేపట్టారు. అనంతరం రాత్రి గ్రామం అంతా కలిసి సామూహిక భోజనం కార్యక్రమం చేపట్టారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

భాకరాపేట: పంచాయతీ నిధులు, విధులపై కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయ డీఆర్పీ కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే విధిగా నిర్వహించడంతోపాటు పంచాయతీ కార్యదర్శులు ఆయా ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే పీఎఫ్ఎంఎస్ బిల్లులు చెల్లింపులు, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈవోపీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



తిరుమల: శ్రీవారిని గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని, మినిస్ట్రీ ఆఫ్ రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ హైవే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్‌పీ.సింగ్, కర్ణాటక మాజీ ఎమ్మెల్యే రాములు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.